



# టెక్కలి వైకాపా ఇన్‌ఛార్జిగా పేరాడ



(సత్యంన్యూస్, టెక్కలి)

కుటుంబ కలహాలతో వివాదాస్పదమైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించి పేరాడ తిలక్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. గత ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలైన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం రచ్చకెక్కడంతో ఆయన మార్పు అనివార్యమైంది. 2019లో పేరాడ తిలక్ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2014లో టెక్కలి వైకాపా అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో దువ్వాడ శ్రీను భార్య దువ్వాడ వాణి తనకు అసెంబ్లీ టిక్కెట్ కావాలని జగన్‌కు విన్నవించడంతో కొన్నాళ్లు ఆమెను ఇన్‌ఛార్జిగా నియమించినా, ఆ తర్వాత ఎన్నికల ముందు జరిగిన మార్పులు, చేర్పుల్లో పేరాడకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. కానీ శ్రీనుకే బాధ్యతలు అప్పగించారు. పార్టీ పరువు రచ్చకెక్కడంతో ఇప్పుడు పేరాడకు బాధ్యతలు అప్పగించాల్సి వచ్చింది.

సంచలన సాయంకాల పత్రిక


# సత్యం


https://www.satyamdaily.net/

శుక్రవారం 23-8-2024

సంపుటి: 20 సంచిక: 129

పేజీలు: 4 వెల: రూ.1






## వైద్యుల వంకరబుద్ధి..

-బ్రోకర్ల ప్రమేయంతో సదరం పత్రాల జారీ

-పత్రాలు ఇచ్చేది.. వెరిఫికేషన్ చేసేదీ వారే

-20న జరిపిన నిజనిర్ధారణ పరీక్షల్లోనూ అక్రమాలు

-విశాఖకు పంపించి పరీక్షలు చేయించాలని డిమాండ్

దరఖాస్తుదారులకు అసలు వైక్యలం ఉందా లేదా? ఉంటే.. ప్రభుత్వ రాయితీలు పొందేంత అర్హత ప్రమాణాల మేరకు ఉందా? అనేది నిర్ధారించి వైకల్య సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వ వైద్యులదే. సదరం కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుదారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అర్హతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు జిల్లాస్థాయిలో ఒక మెడికల్ బోర్డు ఉంటుంది. అయితే వైకల్యాన్ని నిర్ధారించాల్సిన వైద్యులే వంకరబుద్ధితో వ్యవహరిస్తుండటంతో జిల్లాలో పెద్దసంఖ్యలో అనర్హులు సదరం సర్టిఫికెట్లు పుట్టించి ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, ఉద్యోగాలను అప్పనంగా కొట్టేసి దర్జాగా అనుభవిస్తున్నారు. ఈ విషయంలో బ్రోకర్లు కూడా జిల్లావ్యాప్తంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు అటు వైద్యులు, ఇటు దరఖాస్తుదారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారేలా ఒప్పందాలు కుదిర్చి వైకల్యం లేనివారికి.. ఉన్నా అర్హత ప్రమాణాలు లేనివారికి కూడా వైకల్య సర్టిఫికెట్లు జారీ చేయించేస్తున్నారని స్పష్టమవుతోంది. ఇటువంటి ఉదంతాలు తరచూ ఫిర్యాదుల రూపంలో వెలుగులోకి వస్తున్నా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# అనర్హులకు వైకల్యసిద్ధి!



గ్రహణంమొర్రి వైకల్యంగా చూపించి పింఛను అందుకుంటున్న నాగరాజు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సదరం ద్వారా తప్పుడు ధ్రువపత్రాలు పొంది వికలాంగ పింఛన్లు, ఇతర ప్రభుత్వ రాయితీల అందుకుంటున్న ఉదంతాలు పుంఖానుపుంఖాలుగా బయటకొస్తున్నాయి. ఇప్పటికే ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్, పొందూరు మండలం ధర్మవరం గ్రామాలకు చెందిన కొన్ని కేసులు ఇప్పటికే నలుగుతుండగా.. తాజాగా ఆ జాబితాలో జలుమూరు మండలం సైరిగాం గ్రామం కూడా చేరింది. ఈ మూడు గ్రామాలకు చెందిన 61 మందికి నోటీసులు జారీ చేసి ఈనెల 20న వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో పదిమంది నిర్ధారణ పరీక్షలకు హాజరు కాలేదు. హాజరైనవారిలో 26మందిని అర్హులుగా, 18 మందిని అనర్హులుగా గుర్తించారు. మరో ఏడుగురికి బేరా టెస్ట్ (వినికిడి సమస్యకు సంబంధించి మరింత అడ్వాన్స్‌డ్ పరీక్ష) చేయించాలని రిఫర్ చేశారు. సైరిగాంలో 33 మందిపై ఫిర్యాదులు అందగా వారిలో ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలు చేయించుకున్నవారిలో 16మంది అర్హులుగా, ఐదుగురిని అనర్హులుగా గుర్తించారు. మరో ఐదుగురిని బేరాటెస్ట్‌కు రిఫర్ చేశారు. ఇబ్రహీంబాద్‌కు సంబంధించి వైకాపా ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న 11 మందిలో ముగ్గురు గైర్హాజరు కాగా ఆరుగురిని అనర్హులుగా గుర్తించారు. ఇద్దరి వైకల్యాన్ని మాత్రమే పూర్తిస్థాయిలో నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన ఎన్డీయే కూటమి ఇచ్చిన ఫిర్యాదులోని ఎనిమిది మందిలో ఇద్దరు అనర్హులని తేలారు. ఒకరు గైర్హాజరయ్యారు. అయితే నిజనిర్ధారణలో వైద్యులు నిష్పక్షపాతంగా వ్యవహరించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇబ్రహీంబాద్‌కు చెందిన మొత్తం 19 మందికి వైద్య పరీక్షలకు రావాలని నోటీసులు ఇచ్చారు. వీరిలో తొమ్మిదిమంది రణస్థలం సీహెచ్‌సీలో సదరం ధ్రువపత్రాలు పొందినవారు కాగా నలుగురు రిమ్స్ నుంచి, ఆరుగురు పాలకొండ, టెక్కలి, నరసన్నపేట, ఏలూరు తదితర ఆస్పత్రుల్లో ధ్రువపత్రాలు పొందారు. ఇప్పుడు ఆర్హత సాదించిన వారంతా రిమ్స్‌లో సదరం చేయించుకున్నవారే కావడం విశేషం.

### మెడికల్ బోర్డు స్థాయిలోనూ ఒప్పందాలు

జిల్లాలో ఎక్కడ సదరం పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందినా వాటికి రిమ్స్ మెడికల్ బోర్డు అనుమతి తప్పనసరి. ఈ సర్టిఫికేట్ రద్దు చేయాలన్నా అదే మెడికల్ బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ బోర్డులో సభ్యులుగా ఎవరు ఉండాలన్నది రిమ్స్ సూపరింటెండెంట్, ఆర్ఎంవో నిర్ణయిస్తారు. బోర్డు సభ్యులు ఎప్పటికప్పుడు మారుతుంటారు. సదరం వైద్య పరీక్షలు నిర్వహించే వైద్యులను ఆ బోర్డులోకి తీసుకోకూడదు. కానీ ఈ నిబంధన చాలా సందర్భాల్లో అమలు కావడంలేదు. ఎందుకంటే - మిగతా 4లో









• ఎడిటోరియల్

# పారిశ్రామిక ప్రమాదాలు ప్రభుత్వాల పాపమే!

రాష్ట్రంలో మరో ఘోర ప్రమాదం సంభవించింది. అదీ ఉమ్మడి విశాఖ జిల్లా పారిశ్రామికవాడలోనే కావడంతో పరిశ్రమల ఖిల్లా తల్లడిల్లుతోంది. పరిశ్రమలు అంటేనే యంత్రాలు, రసాయనాలతో పని. మానవ జీవనానికి ఈ పరిశ్రమలు ఎంత మేలు చేస్తాయో.. ఏమరుపాటుగా ఉంటే అంతకు మరింత చేటు చేస్తాయి. అందువల్ల పరిశ్రమల నిర్వాహకులు, వాటిలో పనిచేసే వారు, వాటిని పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అలా లేకపోవడం వల్లే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పారిశ్రామికవాడలోని ఎసెన్షియా ఫ్యాక్టరీలో పెను ప్రమాదం సంభవించి 17 మంది ఉద్యోగులను బలి తీసుకుంది. మరెంతోమందిని క్షతగాత్రులను చేసి ఆస్పత్రుల పాల్జేసింది. ఇటువంటి దారుణ ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు అవి జరిగినప్పుడే హడావుడి చేసి.. తర్వాత ఆ ఊసే పట్టించుకోకుండా మౌనం వహిస్తాయన్న విమర్శలు కొత్తవేం కావు. పైగా ఇందులో రాజకీయ మైలేజీ కోసం అధికార ప్రతిపక్షాలు కక్కుర్తిపడటం శవాల ముందు పేలాలు ఏరుకున్నట్లే ఉంటుంది. ఇప్పుడు ఎసెన్షియా ప్రమాద ఘటనలోనూ అదే జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మధ్యాహ్నం ప్రమాదస్థలాన్ని సందర్శించారు. అదేవిధంగా వైకాపాకు చెందిన మాజీమంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వీరిద్దరితో పాటు రెండు పార్టీలు సోషల్ మీడియా వేదికగా ఘోర ప్రమాదానికి కారణం మీరంటే మీరేనంటూ దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. పారిశ్రామిక ప్రమాదాలకు కారణం గత వైకాపా ప్రభుత్వ నిర్వాకాలేనని టీడీపీ సోషల్ మీడియా ప్రచారం మొదలుపెట్టింది. భద్రతా ప్రమాణాలు (సేఫ్టీ మెజర్స్) పాటించని పరిశ్రమల నుంచి డబ్బులు దండుకుని గత ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి దారుణాలు సంభవిస్తున్నాయని, పైగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయినందున దీంతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు టీడీపీ తప్పించుకునే రీతిలో పోస్టులు పెట్టింది. సహజంగానే వైకాపా సోషల్ మీడియా దీన్ని కౌంటర్ చేస్తూ తనకు అనుకూలంగా పోస్టులు వదిలింది. అచ్యుతాపురం ఘటన జరిగిన వెంటనే తక్షణ చర్యలు చేపట్టలేక తెల్లమొహం వేసిన చంద్రబాబు సర్కారు.. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు గత ప్రభుత్వంపైకి తప్పును నెట్టి చేతులు దులిపేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. సుమారు మూడేళ్ల క్రితం ఇదే ఉమ్మడి విశాఖ జిల్లా కొత్తపాలెం సమీపంలోని ఎల్జీ పాలిమర్స్‌లో విషవాయువు లీకైనప్పుడు మృతుల కుటుంబాలకు ఎన్నడూ లేనివిధంగా రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించిందంటున్నారు. ఏడాదిలో రెండుసార్లు పరిశ్రమలు కాంప్లియన్స్ రిపోర్టులు ఇచ్చేలా నిర్ణయం తీసుకుందంటున్నారు. కొత్త ఇండస్ట్రియల్ సేఫ్టీ పాలసీ అమలు చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన విషయాన్ని వైకాపా నేతలు గుర్తు చేస్తున్నారు. అయితే టీడీపీ, జనసేన నేతలు దీనికి కౌంటర్ ఇస్తున్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించకపోవడం వల్లే ప్రైవేట్ పరిశ్రమలదారులు భద్రతా ప్రమాణాల పాటింపు విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇవే ప్రమాదాలకు దారితీస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులే చేయాల్సిన సేఫ్టీ ఆడిట్‌ను గత వైకాపా సర్కారు థర్డ్‌పార్టీ ఏజెన్సీలకు అప్పగించడం ద్వారా ఘోరాలకు ద్వారాలు తెరిచిందన్న విమర్శలను టీడీపీ సంధించింది. ఈ రాజకీయ దుమారంలో అసలు ప్రమాదం తీవ్రత, నష్టాలు పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడల్లా ప్రతిపక్షం అధికార పార్టీని తప్పుపట్టడం.. అధికార పక్షం తమకు ముందున్న ప్రభుత్వంపైకి బాధ్యతను నెట్టివేయడానికి ప్రయత్నించడమే తప్ప ఏ ఒక్క ప్రభుత్వమూ పరిశ్రమల్లో భద్రత విషయంలో ఉపేక్షిస్తున్న పారిశ్రామికవేత్తలను నిలబెట్టి నిలదీసేందుకు, అవసరమైతే శిక్షించేందుకు చొరవ తీసుకోవడంలేదు. దీనికి కారణం.. వారి నుంచి ఆయా పార్టీలకు ఠంచనుగా విరాళాలు అందడమే. దాన్ని బయటకు చెప్పకుండా పారిశ్రామికవేత్తలపై చర్యలకు దిగితే రాష్ట్రానికి పరిశ్రమలు రావన్న సాకు పాలక పార్టీల వద్ద సదా సిద్ధంగా ఉంటుంది. కార్పొరేట్ శక్తులకు తలొగ్గి, పరిశ్రమలు రావన్న బూచిని చూపించి ప్రజలను బలి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫార్మా, ఇతర రసాయన కంపెనీలు అత్యంత ప్రమాదకరమైన రెడ్‌జోన్ పరిశ్రమల జాబితాలోకి వస్తాయి. అపరిమితమైన కాలుష్యం వెదజల్లడంతో పాటు విషవాయువులు, రసాయన నిల్వల వల్ల ఈ పరిశ్రమల్లో పని చేసే వేలాది ఉద్యోగులతో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల ప్రజలు నిత్యం ప్రమాదాలతో సావాసం చేయాల్సి ఉంటుంది. పరిసర ప్రాంతాల్లోని గాలి, నీరు రసాయనాల ప్రభావంతో విషతుల్యంగా మారుతుంటాయి. అందువల్ల ఈ తరహా పరిశ్రమల్లో ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పరిసర ప్రాంతాలవాసులకు ఎటువంటి హాని జరగకుండా కట్టుదిట్టమైన ముందు జాగ్రత్త చర్యలు, కాలుష్య నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని ఈ పరిశ్రమలకు లైసెన్సు ఇచ్చే సమయంలోనే షరతులు పెడుతుంటారు. అవి అమలవుతున్నాయో లేదో పరిశీలించేందుకు పరిశ్రమల శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిర్దేశిత సమయాల్లో తనిఖీలు చేసి నిర్ధారించాల్సి ఉంటుంది. ఏమాత్రం రూల్స్ అతిక్రమించి నిర్లక్ష్యం వహించినట్లు తేలినా వెంటనే సంబంధిత పరిశ్రమ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలి. కానీ రాజకీయ, కార్పొరేట్ ఒత్తిళ్లు ఈ పని చేయనివ్వడం లేదు. అంతా సాఫీగా జరుగుతున్నన్నాళ్లు చేతులు ముడుచుకుని కూర్చోవడం, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం, నష్టపరిహారం పేరుతో బాధితులను చల్లబర్చడంతో సరిపెట్టేస్తుంటారు.

## కాకినాడ ఆదిత్యలో డ్రగ్ డి-ఎడిక్షన్ అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యామండలి చైర్మన్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సూచనల మేరకు డ్రగ్ డి-ఎడిక్షన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఎస్‌పి ఫౌండేషన్ ఫౌండర్, ప్రముఖ సైకాలజిస్ట్ రాజశేఖర్ పొన్నాడ మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్‌పై అవగాహనతోపాటు దానివల్ల కలిగే దుష్ప్రభావాలను తెలుసుకోవాలన్నారు. సమాజంలో నేటి యువతకు డ్రగ్స్ చీడ పురుగులా మారాయన్నారు. కార్యక్రమం అనంతరం రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎల్.మోహనరావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




## చిరంజీవి బర్త్‌డే వేడుకలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక సరస్వతి మహల్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా అంధవరపు సంతోష్, థియేటర్ ప్రొప్రైటర్ పెద్దరాజు, మేనేజర్ చిన్నరాజు సమక్షంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంజరాపు రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున గుజరాతిపేట జగన్నాధస్వామి గుడిలో వరం కుమారుడు సంతోష్, జనసేన శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ చేతుల మీదుగా సిమెంట్ బెంచీ అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పైడి శ్రీనివాస్, నరసింహం, పి.తిరుమల మోహనరావు, బూరవెల్లి శ్రీనివాసరావు, గోపి శంకర్, సత్యనారాయణ, జిలానీ, కింతాడ సంతోష్, అప్పారావు, గిరి, హుస్సేన్, వురిటి సునీల్‌కుమార్, సూర్యపవన్, పోస్ట్‌మాన్ శ్రీనివాసరావు, రామరావు, జల్లెపల్లి రామారావులు పాల్గొన్నారు.

## శాఖాగ్రంథాలయంలో టంగుటూరి జయంతి

(సత్యంన్యూస్, పాలకొండ)

స్థానిక శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలు కొనియాడారు. ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలబ్బాయిగా చదువుకొని ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారని, 1940,50 దశకాల్లో ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరని గుర్తుచేశారు. 1907లో లండన్‌లో ప్రశంసా పత్రంతో బారిష్టర్ కోర్సు పూర్తి చేసుకొని ప్రకాశం మద్రాస్ ఉన్నత న్యాయస్థానంలో ప్రాక్టీస్ ప్రారంభించి, 1921లో స్వాతంత్ర్య సమరంలో అడుగుపెట్టి వృత్తిని వదిలిపెట్టే నాటికి లక్షల్లో సంపాదించి, యావదాస్తిని దేశసేవకే ఖర్చు చేసిన మహనీయుడని తెలిపారు. మద్రాస్‌లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీకి ఎదురుగా గుండె నుంచి ఆంధ్రకేసరి అనే పేరు పొందినవాడన్నారు. కార్యక్రమంలో పాఠకులు వై.మహేష్, పురుషోత్తం, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.



## నిరుపేద బాలికలకు 'వి ఫర్ నీడి' సాయం

(సత్యంన్యూస్, పలాస)

వజ్రపుకొత్తూరు మండలం పూడి జగన్నాధపురం గ్రామానికి చెందిన తిమ్మల అప్పలస్వామి గత కొంతకాలంగా అనారోగ్యం బారినపడి ప్రాణాలు కోల్పోయారు. నిరుపేద కుటుంబానికి చెందిన అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు వైశాలి, వినీత ఉన్నారు. ఇంటి పెద్ద లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న అమెరికాకు చెందిన 'వి ఫర్ నీడి సంస్థ' ఆ కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లెవలస సభ్యులు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పిల్లల చదువులకు మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, ఎర్నాగుల అరవింద్ పాల్గొన్నారు.



## ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు అని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్ కుమార్ అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా డీఆర్‌డీఏ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో కలసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసులో జరిగిన సైమన్ కమిషన్ ప్రదర్శనలో తుపాకీకి ఎదురుగా వెళ్లి తన గుండె చూపించి ఆంధ్ర కేసరి అని పేరు పొందారని గుర్తుచేశారు. 35ఏళ్లకే రాజమండ్రి మున్సిపాలిటీకి చైర్మన్‌గా వ్యవహరించారని, 1937లో అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రాజాజీ సర్కార్‌లో రెవిన్యూ మంత్రిగా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏవో దొర, మూర్తి, శ్రీధర్, మాధవి, బీమా సిబ్బంది పాల్గొన్నారు.






## 'ఇంద్ర'లో అల్లు అర్జున్!!

'ఇంద్ర' సినిమా ఈరోజు రీ రిలీజ్ అయ్యింది. చిరంజీవి పుట్టిన రోజు కదా? థియేటర్ల దగ్గర మెగా ఫ్యాన్స్ 'ఇంద్ర'తో సంబరాలు చేసుకొంటున్నారు. అయితే హైదరాబాద్ ఇంద్ర సినిమా ప్రదర్శిస్తున్న ఓ థియేటర్లో 'అడుగో బన్నీ.. అడుగో బన్నీ' అంటూ ఫ్యాన్స్ బన్నీ పేరు పలవరించడం కనిపించింది. 'ఇంద్ర'లో బన్నీ లేడు. అయినా అల్లు అర్జున్ పేరు ఎందుకు వినిపిస్తోంది. అదే కదా డౌటు. ఆ వివరాల్లోకి వెళ్దాం. ఇంద్ర' సినిమాలో శివాజీ ఓ కీలక పాత్ర పోషించాడు. చిరంజీవి మేనల్లుడుగా నటించాడు. అప్పటి వరకూ చిరు నమ్మిన బంటుగా ఉంటూ, చివర్లో వెన్నుపోటు పొడుస్తాడు శివాజీ. అల్లు అర్జున్ కూడా చిరంజీవి మేనల్లుడే. హీరోగా క్రేజ్ వచ్చేంత వరకూ 'మెగా ఫ్యాన్స్' అంటూ జపం చేసి, ఆ తరవాత సెపరేట్ గా 'ఆర్మీ'నే స్థాపించుకొన్నాడు. మెగా కుటుంబంలోని పవన్ కల్యాణ్ కి దాదాపుగా వెన్నుపోటు పొడిచాడు. నంధ్యాల వెళ్లి, వైకాపాకి ప్రచారం చేసి వచ్చాడు. అఫ్‌కోర్స్.. ఆయన ఓడిపోయాడనుకోండి. అది వేరే విషయం. దాన్ని మెగా ఫ్యాన్స్ సీరియస్‌గా తీసుకొన్నారు. సొంత కుటుంబంలోనే కుంపటి పెట్టేశాడేంటి? అంటూ మాట్లాడుకొన్నారు. ఆ గాయం మెల్లగా మానుతోంది అనగా, మళ్లీ 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నోరు జారాడు. 'ఇష్టమైతేనే వెళ్తా. నచ్చితేనే వస్తా' అంటూ సినిమా డైలాగులు చెప్పాడు. దాంతో మెగా ఫ్యాన్స్ కి మళ్లీ కాలింది. అందుకే 'ఇంద్ర'లో వెన్నుపోటు మేనల్లుడు శివాజీ వచ్చినప్పుడల్లా ఫ్యాన్స్ 'బన్నీ బన్నీ' అంటూ కేకలు వేశారు. సినిమా మొత్తం అయిపోయిన తరవాత, బయటకు వచ్చాక కూడా మెగా ఫ్యాన్స్ బన్నీ చేసిన కామెంట్ల కోసమే మాట్లాడుకోవడం కనిపించింది. చూస్తుంటే బన్నీకి ఇది పెద్ద డామేజ్ గా మారే సంకేతాలు కనిపిస్తున్నాయి.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## ప్రభాస్‌కు శర్వానంద్ సపోర్ట్

'కల్కి'లో ప్రభాస్ జోకర్‌లా ఉన్నాడంటూ ఈ బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతూనే ఉన్నాయి. చాలామంది హీరోలు ఇప్పటికే అర్షద్ వార్సీకి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేశారు. సౌత్ ఇండియన్ హీరోల ప్రాబల్యం భరించలేకే ఇలాంటి కామెంట్లు చేస్తున్నారని మండి పడ్డారు. పబ్లిసిటీ కోసం ఓ స్టార్ హీరోని విమర్శించడం భావ్యం కాదని అర్షద్ వార్సీని హెచ్చరించారు. ఇప్పుడు శర్వానంద్ కూడా ఓ ట్వీట్ తో వార్సీకి వార్నింగ్ ఇచ్చాడు. ఓ నటుడు మరో నటుడ్ని విమర్శించడం నైతికత కాదని సుతిమెత్తగా మందలించాడు. ప్రభాస్ – శర్వానంద్ మంచి స్నేహితులు. ఓ స్నేహితుడిగా, ఓ సాటి హీరోగా ప్రభాస్‌ని విమర్శించిన వాళ్లపై ఇప్పుడు శర్వా ట్విట్టర్ వార్‌కి దిగాడు. అయితే నేరుగా అర్షద్ వార్సీ పేరుని తను ప్రస్తావించలేదు. 'మా' కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొంది. – తెలుగు 360.కామ్ సౌజన్యంతో...




## జక్కన్న హీరోయిన్ అందం చూశారా..!

తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో పలు సినిమాలు చేసి నటిగా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ మన్నారా చోప్రా. మోడలింగ్ ద్వారా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు 2014 లో అంటే దాదాపు దశాబ్ద కాలం క్రితం 'జిద్' సినిమాలో నటించడం ద్వారా బాలీవుడ్ లో అడుగు పెట్టింది. తెలుగు లో జక్కన్న సినిమాతో పాటు రోగ్ ఇంకా సీత సినిమాల్లో కూడా నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయ్యింది. ఈ మధ్య కాలంలో సినిమాల్లో కాస్త ఆఫర్లు తగ్గడంతో మళ్లీ ప్రయత్నాల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ సోషల్ మీడియా ద్వారా సందడి చేస్తోంది. హిందీ బిగ్ బాస్ సీజన్ 17 లో పాల్గొనడం ద్వారా ఉత్తరాది ప్రేక్షకుల దృష్టిని మరోసారి ఆకర్షించింది. కెరీర్ ఆరంభంలో ఎలా అయితే అందంగా, నాజూకుగా మన్నార చోప్రా కనిపించిందో అదే విధంగా ప్రస్తుతం కూడా సోషల్ మీడియాలో అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వార కనిపిస్తోంది. తాజాగా మరో సారి మన్నారా చోప్రా అందమైన ఫోటోలను షేర్ చేసింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌తో మన్నారా లుక్ భలే ఉందే అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడి యాలో మన్నారా అందం గురించి వావ్ అంటూ ప్రశంసిస్తూ లైక్, షేర్ చేస్తు న్నారు. ఢిల్లీలో ఉన్నత చదువులు పూర్తి చేసిన మన్నార చోప్రా ముంబైకి వెళ్లింది. అక్కడ మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంపిక చేసుకుని మెల్ల మెల్లగా మోడల్ గా సెటిల్ అయ్యేందుకు ప్రయత్నించింది. అనూహ్యంగా సల్మాన్ తో పాటు బాలీవుడ్ కు చెందిన పలువురు స్టార్స్ మరియు సెలబ్రిటీలతో యాడ్స్ లో కలిసి నటించే అవకాశం మన్నారా చోప్రాకి దక్కింది. ఆ అవకాశాల కారణంగా మన్నార కి సినిమాల్లో నటించే అవకా శాలు మొదలు అయ్యాయి. కానీ అదృష్టం కలిసి రాక పోవడంతో జక్కన్న హీరోయిన్ మన్నారాకి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ప్రియాంక చోప్రా కజిన్ అయినప్పటికీ మన్నారా చోప్రా కి పెద్దగా ఉపయోగం లేదు అనేది ఆమె సన్నిహితుల మాట. నటిగా బాలీవుడ్‌తో పాటు సౌత్‌లో అలరించే విధంగా ప్లాన్ చేసుకోవడం ఈమె చేసిన పెద్ద తప్పు అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం మళ్లీ మన్నారా ఇండస్ట్రీలో బిజీ అవ్వబోతుందని, ఈసారి హిందీ ప్రేక్షకులు కచ్చితంగా మన్నారాను అంగీకరించడం ఖాయం. తెలుగులో కూడా మన్నారా మళ్లీ నటించాలని కొందరు నెటిజన్స్ సోషల్ మీడియాలో ఈ ఫోటోలకు కామెంట్స్ చేస్తూ మెసేజ్‌లు చేస్తున్నారు.



– తుపాకి.కామ్ సౌజన్యంతో...



# అంతరిక్ష కేంద్రంగా ఆధ్యాత్మిక మందిరం!

**ఓ ప్రార్థనా మందిరం అంతరిక్ష కేంద్రంగా అవతరించిన విధంబెట్టిదనిన! జాతీయ అంతరిక్ష దినోత్సవం రోజున తెలుసుకోవాల్సిన ఓ చరిత్ర పాఠం!!**

ఈ రోజు నేషనల్ స్పేష్ డే. సరిగ్గా ఏడాది క్రితం 2023 ఇదే రోజు చంద్రయాన్-3తో మన ఇస్రో సృష్టించిన ఓ చరిత్రకు చిహ్నంగా ఈరోజు మనం ఈ నేషనల్ స్పేస్ డేను ఓసారి గుర్తుకు తెచ్చుకోవాలి. విక్రమ్ ల్యాండర్ ఏ విధంగా చందమామపై ఉన్న దక్షిణ ధృవాన్ని తాకిందో తెలుసుకున్న మనం ఆ లెగసీని ఇంకా మున్ముందుకు తీసు కెళ్లి మనది కాని అంతరిక్ష ప్రపంచంలోనూ ఏం జరుగుతుందో శోధించడం, శోధించి సాధించడం ఓ థ్రిల్. ప్రపంచ దేశాలతో పోటీలో ఓ సవాల్. అందుకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్.. మొత్తంగా స్టెమ్ అనే శాస్త్రీయ విజ్ఞానాన్ని ఎలా ప్రమోట్ చేయాలో ఇప్పుడు మరింత చర్చ జరగాల్సిన రోజులివి. అందుకే 2023, ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్‌తో చరిత్ర సృష్టించిన రోజును నేషనల్ స్పేస్ డేగా ప్రధాని మోదీ ప్రకటించగా.. టచింగ్ లైవ్స్ వైల్ టచింగ్ ద మూన్.. ఇండియా పేస్ సెగా అనే థీమ్‌తో ఈ 2024 ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినాన్ని మనం జరుపుకుంటున్నాం.

ఇదంతా ఇప్పటివరకూ మనం రోజూ ఏదో ఒకచోట వార్తల్లో, వార్తా కథనాల్లో ఎంతోకొంత తెలుసుకోగలుగుతున్నదే. అయితే, ఇంత శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి దోహదపడ్డ విక్రమ్ సారాభాయ్.. మొట్టమొదట ఎక్కడి నుంచి తన రాకెట్ ప్రయోగాన్ని చేశారో ఈ కథలో తెలుసుకుందాం.

అది 1963.. చుక్కల్లోకి ఒక రాకెట్ రివ్వున ఎగిసింది. అదేదో పెద్ద సెటప్ ఉన్న అంతరిక్ష కేంద్రమా..? కాదు.. ఓ క్యాథలికి చర్చ్. అవును భారతదేశం తన మొట్టమొదటి రాకెట్ ప్రయోగం చేసిన ఆ కథ ఎంతో ఆసక్తికరమైంది. ఎందుకంటే రాకెట్ తో పాటు.. దాన్ని గగనతలంలోకి వదిలే స్పేర్ పార్ట్స్, ఉత్ప్రేరకాలన్నింటినీ సైకిళ్లు, ఎడ్లబండ్లపై సరఫరా చేసిన రోజులవి. మరి క్రైస్తవ ప్రార్థనా మందిరం.. అంతరిక్ష కేంద్రంగా ఎలా మారింది..?

సరిగ్గా 1960ల కాలంలో మన గర్వించదగ్గ శాస్త్రవేత్త డాక్టర్ విక్రమ్ సారాభాయ్ త్రివేంద్రంలోని తుంబా అనే ఓ చిన్న మత్స్యకార గ్రామాన్ని రాకెట్ లాంచింగ్ స్టేషన్‌కు వేదికగా ఎంచుకున్నారు. ఎలాంటి సంభావ్యతలకు లోనుకాని ఓ ప్రదేశంగా తుంబా క్యాథలిక్ చర్చ్ ప్రాంతం అనువైనదిగా భావించారట విక్రమ్ సారాభాయ్. తుంబాలో ఉన్న సెయింట్ మేరీ మాగ్డలీన్ చర్చ్.. భూమధ్యరేఖపై అయస్కాంతత్వాన్ని కల్గి ఉన్న ప్రాంతం కావడంతో రాకెట్ లాంచింగ్‌కు సరైన ప్రదేశమని నమ్మారు. అందుకే తుంబా క్యాథలిక్ చర్చ్‌ను వేదికగా ఎంచుకోవడానికి.. డాక్టర్ సారాభాయ్‌లో ఈ టెక్నికల్ అంశాలన్నీ కారణమయ్యాయి. ఇంకేం ఓ ఫైన్ మార్నింగ్ విక్రమ్ సారాభాయ్, ఆయన అనుచరులతో కలిసి ఆ చర్చ్‌ను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు, రాకెట్ ప్రయోగం కోసం త్రివేంద్రం బిషప్ డాక్టర్ బెర్నార్డ్ పెరీరాను సంప్రదించారు. తమ రాకెట్ ప్రయోగం కోసం చర్చ్ తమకు కావాలన్న ప్రతిపాదనను విక్రమ్ సారాభాయ్ చర్చ్ బిషప్ ముందు పెట్టారు. ఆ మాటతో ఒక్కసారి ఆ బిషప్‌కు షాక్ కొట్టినంత పనైందట. ఆయన సూటిగా సమాధానం చెప్పకుండా.. వచ్చే ఆదివారం ఒక్కసారి చర్చికి రమ్మని ఆహ్వానించారట వారిని. ఇదంతా మరో ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తన ఇగ్నైటెడ్ మైండ్స్.. అన్ లీషింగ్ ది పవర్ విత్ ఇన్ ఇండియా అనే బుక్‌లో చర్చించారు.

ఇంకేం, ఆ ఆదివారం రానే వచ్చింది. విక్రమ్ సారాభాయ్ మళ్లీ తన సహచరులతో కలిసి చర్చికి వెళ్లారు. ఆ చర్చికి ప్రతీ ఆదివారంలాగే పెద్ద ఎత్తున ప్రార్థనల కోసం క్రిస్టియన్ భక్తులు పోటెత్తారు. ప్రార్థనలు ముగిశాయి. ఇంకొక సందేశముంది. మీరంతా ఈ సందేశం వినాలి అన్నది బిషప్ మాట. దాంతో పిన్ డ్రాప్ సైలెన్స్ నెలకొంది. అప్పుడు బిషప్ ఏమన్నాడంటే..?

నాతో ఓ సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఉన్నారు. ఆయన పేరు విక్రమ్ సారాభాయ్. ఆయన మన దేశం కోసం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించే క్రమంలో పలు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పుడు రాకెట్ లాంచింగ్ కోసం మన చర్చిని వారికిమ్మంటున్నారు. సైన్స్ మానవ జీవితాన్ని సుసంపన్నం చేసే సత్యం కోసం అన్వేషిస్తోంది. ఏ మతమైనా చెప్పే ఆధ్యాత్మిక సారం కూడా అదే. మరి ఈ చర్చిని వారి రాకెట్ ప్రయోగం కోసం ఇమ్మంటారా అని అడిగారు బిషప్ బెర్నార్డ్ పెరీరా.

కాస్సేపు మౌనం ఆవహించింది. కానీ, అంతలోనే అక్కడికొచ్చిన భక్తులందరి నుంచీ బిషప్ మాటలకు సానుకూల సమాధానం వచ్చింది. ఆ సమాధానం ఏస్ అంటూ ఆ చర్చంతా ప్రతిధ్వనించింది. ఇంకేం అవసరమైన అనుమతులు వడివడిగా పొందడం.. పేపర్ వర్క్ కూడా పూర్తి కావడంతో.. అక్కడున్న గ్రామస్థులు కూడా పక్క గ్రామానికి షిఫ్ట్ అవ్వడం ఇవన్నీ సామూహిక సహకారంతో చకచకా జరిగిపోయాయి. అలా తుంబా సెయింట్ మేరీ మాగ్డలీన్ చర్చ్ ముందు తోట.. ఓ రాకెట్ లాంచింగ్ స్టేషన్‌గా కొత్త రూపు సంతరించుకుంది.

## సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్ కాస్తా స్పేస్ సెంటర్‌గా

అవునూ! సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ 1544లో గడ్డితో నిర్మించిన ఓ పూరిగుడిసె లాంటి భవనంలో ఓ క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేశాడు. ఆ సెయింట్ ఫ్రాన్సిస్ చర్చే.. 20వ శతాబ్దం నాటికి కాంక్రీట్‌తో నిర్మించిన సెయింట్ మేరీ మాగ్డలీన్ చర్చ్‌గా కొత్త పేరుతో అవతరించింది. సముద్రం ఒడ్డున కొందరు మత్స్యకారులు గంధపు చెక్కలతో చేసిన మేరీ మాగ్ధలీన్ విగ్రహాన్ని గుర్తించడం వల్లే.. ఆ తర్వాత ఆ చర్చ్ పేరు మారడానికి గల కారణంగా చెబుతారు. అలా 1960లో తుంబా చర్చి రాకెట్ లాంచింగ్ స్టేషన్‌గా మారగా, ప్రార్థనా మందిరం ప్రయోగశాలగా, బిషప్ ఉండే గది తన డ్రాయింగ్ రూమ్‌గా ఉండేదని కలాం తన పుస్తకంలో పేర్కొన్నారు. చర్చ్‌లోని పశువుల కొట్టం శాస్త్రవేత్తలంతా పనిచేసే ప్రయోగశాలగా ఉండేదట. ఇప్పుడా ఆ చర్చ్ అంతరిక్ష మ్యూజియంగా గుర్తింపు పొందింది. అలా తుంబా ఈక్వెటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్.. విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రంగా మారింది. ఇవాళ ఇస్రో వివిధ శాఖలు వివిధ ప్రాంతాలకు విస్తరించగా.. మూలం మాత్రం తుంబా క్యాథలిక్ చర్చ్ కావడం ఓ విశేషం.

## సైకిల్‌పై రాకెట్! చర్చ్‌లో లాంచ్ ప్యాడ్!!

ఇవాళ స్పేస్ రాకెట్ ప్రయోగాల్లో భారత్ పేరు విశ్వవ్యాప్తంగా మారుమోగుతూ.. విదేశీ సాంకేతికతకు కూడా సవాళ్లు విసురుతున్న కాలాన.. ఓసారి గుర్తు చేసుకుంటే.. మొట్టమొదటి రాకెట్ ప్రయోగానికి కావల్సిన విడిభాగాలను, ముడిసరకును సైకిళ్లు, ఎడ్లబండ్లు ఉపయోగించి తరలించిన రోజులు నిజంగా ఓ నోస్టాల్జియా. యూఎస్‌లోని నేషనల్ ఎరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్, నైక్-అపాచీ వంటి విడిభాగాలన్నీ కేవలం సైకిళ్లు, ఎడ్లబండ్లపైనే నాడు తుంబా క్యాథలిక్ చర్చుకు ఎంతో శ్రమకోర్చి తరలించారు.





అలా నవంబర్ 21, 1963లో సెయింట్ మేరీ మాగ్జలీన్ చర్చ్ నుంచి మొట్టమొదటి భారతదేశం ప్రయోగించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన ఓ చారిత్రాత్మక రోజుగా చరిత్రై నిల్చిపోయింది. ఒకనాడు బూట్లు, చెప్పులు ధరించకుండా లోనికి వెళ్లే ప్రార్థనా స్థలం.. బెల్స్, టవర్స్‌తో అందంగా కనిపించిన చర్చ్ అందాలిప్పుడు.. శాస్త్ర, సాంకేతిక రంగాలను చిహ్నాల్లా మారిపోయి ఓ మ్యూజియంగా మారిపోయాయి. ఒకనాటి తుంబాలోని సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్, 20వ శతాబ్దానికి కాంక్రీట్‌తో సెయింట్ మేరీ మాగ్దలీన్ చర్చ్‌గా అవతరించిన ప్రార్థనా మందిరంలో.. ఇప్పుడు క్రీస్తు బలిపీఠంకు బదులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశ పురోగతి మనకు దర్శనమిస్తుంది.

*ఇదండీ ఓ ఆధ్యాత్మిక ప్రార్థనా మందిరం. ఓ శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన ప్రయోగకేంద్రంగా. ప్రస్తుతం ఓ సైన్స్ మ్యూజియంగా రూపాంతరం చెందిన కథ! మరిన్ని విజయాలు సాధించి ఇస్రో ప్రపంచ దేశాల ముందు కాలరెగురాయాలని ఆశిద్దాం! నేషనల్ స్పేస్ డే సందర్భంగా ఇస్రో సాధించిన విజయాలకు, చేస్తున్న ప్రయోగాలకు అభినందలు తెలియజేద్దాం!!*


**- రమణ కొంటికర్ల**

## హజరత్ రోషన్ షావలి బాబా దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే శంకర్



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి చిన్నబజార్ రోడ్డులోని హజ్రత్ రోషన్ షావలి బాబా దర్గాను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వాహబ్, హజరత్ రోషన్ షావలి బాబా ముజావర్లు షేక్ సలీం, షేక్ హుస్సేన్, షేక్ ఆరు చాదర్ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో నగర మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్, బహుదూర్ భాషా, తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు ఎండీ రఫీ, షాహిద్, సలీం, గఫర్ ఖాన్, జనసేన జిల్లా మైనారిటీ నాయకులు రఫీ, మతపెద్దలు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.






# దొంగతనాలకు కోచింగ్



- రూ.2లక్షలు చెల్లిస్తే.. దోపిడీలో గ్రాడ్యుయేట్
- విద్యార్థులంతా 12 నుంచి 17 ఏళ్లలోపు వారే
- డబ్బు, నగల కోసం ఎలాంటి క్రైంకైనా శిక్షణ
- పిల్లల జీవితాన్ని బలిపెడుతున్న తల్లిదండ్రులు
- సెల్‌ఫోన్ ఉంటే అక్కడ తలుపులు తెరుచుకోవు

**భోపాల్‌కు 300 కిలోమీటర్ల దూరంలోని మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లోని పచోర్ జిల్లాలోని కడియా అనే గ్రామస్తులు తమ పిల్లలను ఢిల్లీ వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఆడంబరమైన పెళ్లిళ్లలో దొంగిలించే 'బ్యాండ్, బాజా, బారాత్' ముఠాలకు 'అద్దెకి' ఇవ్వడంలో పేరుగాంచారు. 'ఉద్యోగ శిక్షణ' కోసం ముఠాలతో గత మూడు నెలల్లో 11 మందికి పైగా మైనర్లు గ్రామాన్ని విడిచిపెట్టినట్లు పరిశోధనలు చూపిస్తున్నాయి. అక్కడ తల్లిదండ్రులు తమ పిల్లలను వారితో పంపడానికి ముఠా సభ్యులతో బాండేజ్ ఒప్పందాలపై సంతకం చేస్తారు, ప్రతిగా రూ. 2 - 5 లక్షల వార్షిక రుసుము తీసుకుంటారు. గత నాలుగు నెలలుగా, వివిధ రాష్ట్రాల నుంచి 86 పోలీసు బృందాలు పచోర్‌ను సందర్శించి అనుమానితులను కనుగొని వారిని నియమించే ముఠా సభ్యులను అరెస్టు చేశాయి. విలాసవంతమైన వివాహాల్లో 34 దొంగతనాలకు పాల్పడినట్లు ఏప్రిల్‌లో ఢిల్లీ పోలీసులకు పచోర్‌లోని మైనర్‌లు తెలిపారు. 'ఫైవ్ స్టార్ హోటళ్లలో రూ.30లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురైన మూడు కేసుల్లో, 7 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న నిందితులైన అబ్బాయిలను ఢిల్లీలోని ముఠాల వద్దకు పంపడానికి వారి తల్లులు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ఒప్పందం చేసుకున్నారని ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. జూలై 3న నైరుతి ఢిల్లీలోని ఓ వివాహ వేదిక నుంచి బహుమతులు, రూ. 8 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ని ఓ మైనర్ అపహరించినట్లు తాజా కేసు నమోదైంది. వివిధ కేసుల్లోని దర్యాప్తులు పోలీసులు గ్రామంపై దృష్టి పెట్టడానికి దారితీశాయి. అందుకే ఆ గ్రామంలో చెత్తతో నిండిన ఎగుడుదిగుడు రోడ్డులో సైతం రెండు అంతస్థుల ఇళ్లు, బంగారు ఆభరణాలతో అలంకరించబడిన మహిళలు, ఖరీదైన బైక్‌లు నడుపుతున్న యువకులు, ట్యాబ్లెట్‌లలో గేమ్‌లు ఆడుతున్న పిల్లలు, వారి కొత్త ఐఫోన్‌లను ప్రదర్శిస్తూ కనిపిస్తారు.**



**పిక్ చూశారా.. అదొక కోచింగ్ సెంటర్. ఫీజు రెండేళ్లకు రెండు నుంచి మూడు లక్షలు. అందులో విద్యార్థులు 12 నుంచి 17 ఏళ్ల వరకు అక్కడ కోచింగ్ తీసుకుంటారు. ఇంతకీ ఏ కోర్సు అని అడుగుతున్నారు కదా.. వినండి దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు.**

మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నుంచి 117 కిలోమీటర్ల దూరంలోని కడియా, గులేడి, హాలేడి గ్రామాలు. ఇక్కడ ప్రతీ ఏడూ దాదాపు 300 మంది పిల్లలకు శిక్షణ ఇస్తారు. సిలబస్ దొంగతనం, చైన్ స్నాచింగ్, బైక్ రాబరీ, బ్యాగ్ రాబరీ, ల్యాప్టాప్, సెల్‌ఫోన్లు ఇతర గాడ్జెట్ల దొంగతనం చేయడంలో తర్ఫీదునిస్తారు.

ఆగకుండా మైళ్లకొద్దీ పరిగెత్తడం, క్షణాల్లో ఆహార్యం రూపురేఖలు మార్చుకోవడంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆ మూడు గ్రామాల్ని నర్సరీస్ ఆఫ్ క్రైమ్‌గా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి ఈ కోర్స్ ఫీజు చెల్లిస్తారు. శిక్షణ పూర్తయ్యాక ఆ పిల్లల్ని బ్యాచ్‌లవారీగా విడగొడతారు. ప్రతీ బ్యాచ్‌ను మనం క్రికెట్ ఆటగాళ్లను వేలం వేసినట్టు వేలం వేస్తారు. గ్రామ పెద్దల నుంచి లోకల్ లీడర్ల దాకా సుశిక్షితులైన ఆ పిల్లల్ని కొంటారు. ఒక్కోసారి వాళ్లపై ఇరవై లక్షలు కూడా చెల్లించడానికి వెనుకాడరు. పిల్లల్ని కొన్నవాళ్లు ప్రతీ సంవత్సరం తల్లిదండ్రులకు రెండు నుంచి ఐదు లక్షల వరకూ చెల్లిస్తామని అగ్రిమెంట్ చేసుకుంటారు. ట్రైనింగ్ పూర్తయిన పిల్లలు ఇక దేశం మీద పడతారు. ముంబై, చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి పెద్ద నగరాలు చేరుతారు. బస్టాండ్‌లు రైల్వేస్టేషన్లు, రద్దీ మార్కెట్లు వారి పాగా.

ఆగస్టు 8, 2024. జైపూర్‌లోని పార్క్ హయాత్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్. హైదరాబాద్‌కు చెందిన బిజినెస్ మ్యాన్ కూతురి వివాహ వేడుకలు. పెళ్లి తర్వాత రిసెప్షన్ కోసం వధువు ముస్తాబు అవుతుంది. ఇంతలో పెళ్లిలో ఆమె ధరించిన నగల బాక్సులు ఉన్న బ్యాగ్ మాయమైంది. ఆ నగల విలువ రెండు కోట్లు. ఆ దొంగతనం చేసింది 14 ఏళ్ల పిల్లాడు.

**దొంగతనం పూర్తయిన వెంటనే ఆ గ్యాంగ్ తలోక దిక్కుకు పారిపోతారు. ఆ నగలని వెంటవెంటనే రోజుకొక ఊర్లో అమ్మేస్తారు. ఈ పిల్లవాడు అతని గ్యాంగ్‌బ్యాగ్‌తో సహా యూపీలో జరుగుతున్న కన్వరీ యాత్ర జనంలో కలిసిపోయారు.**

యశ్ సిసోడియా అనే 20 ఏళ్ల వ్యక్తి గుర్గావ్‌లో ఒక ఖరీదైన పెళ్లిలో ఎనిమిది కోట్ల నగలు దొంగతనం చేశాడు. అదే గ్రామానికి చెందిన రవీంద్ర అనే 15 ఏళ్ల కుర్రవాడు ఢిల్లీలోని ఒక ఫంక్షన్‌లో ఆరు ఖరీదైన సెల్ఫోన్లు కొట్టేశాడు.

వరుసగా నగల దొంగతనాలు జరగడం, అక్కడి



పోలీస్ అధికారి జైదీప్ ప్రసాద్ అతని టీమ్ వెంటవెంటనే అలెర్ట్‌గా కష్టపడడంతో నిందితులను పట్టుకోగలిగారు. ఎన్డీటీవీ ఇటీవలి రిపోర్ట్‌తో ఈ గ్రామాల వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

**చుట్టూ ఎత్తైన కొండల మధ్య ఉన్న ఈ గ్రామాలకు బయటి వారిని ఎవర్నీ రానివ్వరు. చేతిలో సెల్‌ఫోన్ లేదా కెమెరా ఉంటే చాలు గ్రామంలో ఒక్క తలుపూ తెరుచుకోదు. స్త్రీలూ, పురుషులూ ముసలివాళ్లు ఎవరికి చెవులు వినపడవు. ఏది అడిగినా మేము వినలేము అనే అంటారు.**

పచ్చోర్ తెహసిల్‌లో ఉన్న ఈ గ్రామాలకు వెళ్లాలంటే పూర్తి పోలీస్ ఫోర్స్ ఉండాల్సిందే అంటున్నారు డీఐజీ ప్రసాద్. 17 సంవత్సరాలు కూడా నిండని పిల్లలు ఒక్కొక్కరిపై ఇరవై కేసులుంటాయి. మొత్తం 2వేల మందిపై 8వేల కేసులు ఉన్నాయట. నగలు చూడగానే వాటి విలువ అంచనా వేయడంలో ఈ పిల్లలు నిష్ణాతులు. డబ్బు, నగల కోసం ఎలాంటి క్రైంకైనా తెగించే శిక్షణ ఇక్కడ ఇస్తున్నారని తెలిసి అవాక్కయ్యామని అక్కడి బోడా పోలీస్ అధికారి రాంకుమార్ భగత్ తెలిపారు. ఆ తల్లిదండ్రులు వాళ్లపై రెండు లక్షలు పెడితే, అంతకు ఆరు రెట్లు సంపాదిస్తారట. అమాయకులైన పన్నెండేళ్ల పిల్లల జీవితాల్ని తమ స్వార్థం కోసం బలిపెట్టి వాళ్ల బతుకులను అపాయకరమైన పరిస్థితుల్లోకి నెట్టే తల్లిదండ్రులకు ఎలాంటి శిక్ష వేసినా తప్పులేదు.

**- రజిత కొమ్ము**












# ఎండార్స్‌మెంట్ పేరుతో అక్రమ వసూలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎండార్స్‌మెంట్‌కు రూ.5వేలు వసూలు చేస్తున్నట్టు నగరపాలక సర్వేయర్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని పీఎన్ కాలనీ సర్వే నెంబర్ 100/5లో భూహక్కులు కలిగి ఉన్న యజమానులు ఎండార్స్‌మెంట్ కోసం రూ.5 వేలు చెల్లిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎండోమెంట్ భూమిగా నమోదై భూ క్రయవిక్రయాలు జరపడానికి వీలుపడక పదేళ్ల పాటు ఇబ్బందిపడిన పీఎన్ కాలనీవాసులకు ఎండార్స్‌మెంట్ అవసరమయ్యేది. స్థానికుల పదేళ్ల పోరాటం కారణంగా మూడు నెలల క్రితం ఎండోమెంట్ నుంచి పీఎన్ కాలనీలోని 100/5 సర్వే నెంబర్‌లో భూ నిషేధిత భూముల జాబితా నుంచి బయటకు వచ్చింది. అయినా రెవెన్యూ, నగరపాలక సంస్థ సర్వేయర్ కలిసి ఎండార్స్‌మెంట్ పేరుతో డబ్బులు వసూలుచేయడం ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. భూమి క్రయవిక్రయాలు, బ్యాంకులోన్, ఖాళీ స్థలంలో ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు మంజూరుకు జత పర్చాల్సిన ఎండార్స్‌మెంట్ కోసం సర్వేయర్ డబ్బులు వసూలుచేసి రెవెన్యూ అధికారులతో కలిసి వాటాలు పంచుకుంటున్నారని ఆరోపణలు వినిపిసున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి బాధితులు సిద్ధమవుతున్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి సర్వే నెంబర్ 100/5ని తొలగించినా ఎండార్స్‌మెంట్ పేరుతో సర్వేయర్‌తో రెవెన్యూ అధికారులు కలిసి డబ్బులు వసూలుచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న సమయంలోనూ ఇదే పంథాను అనుసరించి ఎండార్స్‌మెంట్ కోసం రూ.వేలల్లో వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

# ఘనంగా సూర శ్రీను పుట్టినరోజు వేడుకలు

- ✔ బెహరా మనోవికాస కేంద్రంలో నిత్యావసరాల పంపిణీ
- ✔ ఆటోడ్రైవర్లకు, నిరుపేదలకు వస్త్రదానం
- ✔ రక్తదాన శిబిరం, చిలకపాలెంలో అన్నదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత, ప్రముఖ సామాజిక, పారి శ్రామికవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర శ్రీనివాసరావు పుట్టినరోజును పురష్కరించుకొని పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెహరా మనోవికాస కేంద్రంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం తోటపాలెంలోని యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవనంలో కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తోటపాలెంలో ప్రజల అభిమానాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటానని, ఇక్కడ తాగునీటి ట్యాంకర్‌తో పాటు రచ్చబండలు నిర్మించానని, స్థానిక పాఠశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. నగరంలోని ఏడురోడ్ల జంక్షన్, డే అండ్ నైట్ కూడలి తదితర ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు. చిలకపాలెం జంక్షన్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరై పేదలకు స్వయంగా వడ్డించారు. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని తన భవనం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 3వేల మంది మహిళలకు చీరలు, టవళ్లను పంచిపెట్టారు.

# వైద్యుల వంకర బుద్ధి.. అనర్హులకు వైకల్య సిద్ధి!

(మొదటిపేజీ తరువాయి)

సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు రిమ్స్‌లోనూ పనిచేసినవారే. జిల్లాలో సదరం ధ్రువపత్రాలు జారీ చేసే రణస్థలం, నరసన్నపేట, పలాస తదితర సీహెచ్‌సీల్లో వైద్యులుగా పనిచేసి రిమ్స్‌కు బదిలీపై వచ్చినవారూ ఉన్నారు. ఇబ్రహీంబాద్‌లో తొమ్మిదిమంది 2022లో రణస్థలం సీహెచ్‌సీ నుంచే సదరం పత్రాలు పొందారు. వీటిని డాక్టర్ రవికిరణ్ పేరుతో జారీ చేశారు. కాగా ఈ తొమ్మిదిమందికి ఈ నెల 20న రిమ్స్‌లో నిజనిర్ధారణ పరీక్షలు చేసిన మెడికల్ బోర్డులో డాక్టర్ రవికిరణ్ ఉన్నారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో అయన్ని తొలగించారు. మెడికల్ బోర్డుకు ఆర్థోపెడిక్ విభాగం హెచ్‌వోడీ నేతృత్వం వహించారు. నోటీసులు అందుకున్న 61మందికి వైద్య పరీక్షలు నిర్వహించే ముందు హెచ్‌వోడీ బోర్డులోని ఇతర వైద్యులతో సమావేశమై రణస్థలం సీహెచ్‌సీ నుంచి జారీఅయిన సదరం పత్రాలపై అభ్యంతరాలు తెలుపవద్దని సూచించినట్టు తెలిసింది. ఆ మేరకు డాక్టర్ రవికిరణ్ జారీ చేసిన ఆ పత్రాలు కలిగిన వారిని అర్హులుగా గుర్తించి పంపించేశారని తెలిసింది. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో హెచ్‌వోడీని రిమ్స్ ఉన్నతాధికారులు పిలిపించి వివరణ కోరినట్టు తెలిసింది. అనంతరం ఆ తొమ్మిదిమందిని అనర్హుల జాబితాలో చేర్చారు.

### అసమగ్రంగా నివేదికలు

నిజనిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత పూర్తి సమాచారం ఇవ్వడానికి మెడికల్ బోర్డు అధికారులకు రెండు రోజులు పట్టింది. వారిచ్చిన సమాచారం కూడా సమగ్రంగా లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పరీక్షలు చేయించుకున్న కొందరి వివరాల నమోదులో గోప్యత పాటించారు. 11మంది ఏ మండలానికి, గ్రామానికి చెందినవారన్న వివరాలు కూడా ఇవ్వలేదు. 15మంది చెందిన సదరం ఐడీలను నమోదు చేయకుండా వైకల్య శాతాన్ని మాత్రమే నమోదు చేశారు. 11మంది విషయంలో సదరం ఐడీలతోపాటు గతంలో ఎంత వైకల్య శాతం పేర్కొన్నారో నమోదు చేయకుండా తాజా పరీక్షల్లో గుర్తించిన వైకల్య శాతాన్నే నమోదు చేశారు. బేరాటెస్ట్‌కు రిఫర్ చేసిన ఏడుగురికి గతంలో ఇచ్చిన వైకల్య శాతాన్ని ప్రస్తావించకుండా తాజాగా నిర్వహించిన పరీక్షల్లో గుర్తించిన వైకల్యశాతాన్నే నమోదు చేశారు. వైద్య పరీక్షల నివేదికలోనే ఇన్ని తేడాలుంటే అసలు నిజనిర్ధారణ పరీక్షలు ఎలా జరిపి ఉంటారోనన్న అనుమానాలు పెరుగుతున్నాయి.

### మళ్లీ ఫిర్యాదులకు సిద్ధం

ఇబ్రహీంబాద్‌తోపాటు సైరిగాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, ఫిర్యాదు చేసినవారందరూ ఆయా గ్రామాలకు చెందినవారే. తమ గ్రామాల్లో ఎవరు వైకల్యంతో బాధపడుతున్నారో స్థానికులకు తెలియకుండా ఉండదు. వీరంతా 2022 తర్వాతే వికలాంగులుగా సదరం ధ్రువపత్రాలు పొందడం గమనార్హం. ఆరోపణలున్న 61 మందిలో 26 మందిని అర్హులుగా నిర్ధారించడంపైనా జాతీయ దివ్యాంగుల సంఘం జిల్లా ప్రతినిధులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వైద్యులపైనా ఫిర్యాదు చేయనున్నట్టు చెబుతున్నారు. డాక్టర్లే బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ వైకల్యం లేనివారికి సదరం పత్రాలు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అర్హులుగా నిర్ధారించిన 26 మందిని విశాఖపట్నం తరలించి పరీక్షలు నిర్వహస్తే వైద్యుల బండారం బయట పడుతుందని అంటున్నారు. కాగా ఇబ్రహీంబాద్‌లో మరో నలుగురు సదరం పత్రాలతో పింఛన్లు పొందుతున్నారు. వీరిలో సీపాన నాగరాజు అనే తాపీ మేస్త్రీకి గ్రహణంమొర్రి ఉందంటూ సదరం పత్రం ఇచ్చారని ఆరోపిస్తున్నారు. 61మందికి నోటీసులు ఇస్తే 51 మందే పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 26 మందికి క్లీన్‌చీట్ ఇవ్వగా ఏడుగురికి మరికొన్ని పరీక్షలు చేయాలని రిఫర్ చేసినందున ఆ 33మందికే పింఛన్లు మంజూరు చేసి మిగతా 28 మందికి నిలిపివేయాలి. కానీ వారందరికీ పింఛన్లు ఆప్రూవ్ చేస్తూ ఈ నెల 21న జాబితాలను సెర్ప్‌కు పంపించారు. అయితే అనర్హులకు, వైద్య పరీక్షలకు హాజరు కానివారికి పింఛన్లు ఉన్నతాధికారులు మంజూరు చేస్తారా, నిలుపదల చేస్తారా లేదా చూడాలి.

# 25న రారవే 115వ సమావేశం

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం రచయితల వేదిక 115వ సమావేశం ఈ నెల 25న ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలియజేశారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరిగే ఈ సమావేశానికి పొట్నూరు కోటిబాబు అధ్యక్షత వహిస్తారని ఆయన అన్నారు. ఈ సభలో కొండ పొలంలో వ్యక్తిత్వ విలువలు అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు ముఖ్య ప్రసంగం చేస్తారని కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి అందుబాటులో ఉన్న సాహితీవేత్తలు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని రంగనాథం కోరారు.

# శాంతిని కేతన్‌లో యువ పర్యాటక క్లబ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో యువటూరిజం, ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని ప్రకాశం పంతులు చిత్రపటానికి సిబ్బందితో పూలమాల వేశారు. సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్ వి.వి. అప్పలనాయుడు, ఆక్స్‌ఫర్డ్, శాంతినికేతన్ సిబ్బంది పాల్గొన్నారు.



# పెద్దమార్కెట్ రామమందిరంలో లక్ష కుంకుమార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పెద్ద మార్కెట్లో ఉన్న లక్ష్మీగణపతి సాయిబాబా సహిత శ్రీరామ మందిరంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మార్కెట్ మర్చంట్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని 108 మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మర్చంట్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరాడ హరిగోపాల్, ఇతర సభ్యులు చిట్టిబాబు, రమేష్, అశోక్(బాబి), అనిల్, ముత్యాలు, సంతు, శేఖర్, శంకర్, షణ్ముఖ, సత్యనారాయణ, రవి, కృష్ణ, గిరి, శిల్లా మణి, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌సీఎస్‌లో ఆంధ్రకేసరి జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పీఎన్ కాలనీలో గల న్యూసెంట్రల్ స్కూల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు జగన్మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయులు బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులతో కలిసి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రకేసరి ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో మంచి పాత్ర పోషించిన వ్యక్తి అని అన్నారు. మద్రాసులో జరిగిన సైమన్ కమిషన్ ప్రదర్శనలో తుపాకీకి ఎదురుగా వెళ్లి తన గుండె చూపించి ఆంధ్రకేసరి అని పేరు పొందారని విద్యార్థులకు వివరించారు. తెల్లదొరలను గడగడలాడించిన ధీరునిగా ఖ్యాతిగాంచారని టంగుటూరి గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.




# హడ్కో కాలనీలో టంగుటూరి జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు బ్రిటిష్ వారి తుపాకులకు ఎదురొడ్డి పోరాడిన మహా ధైర్యశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, చిన్నారులు పాల్గొన్నారు.






# ట్రిపుల్ ఐటీలో పీయూసీ తరగతులు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం పీయూసీ విద్యార్థులకు క్లాస్‌వర్క్ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ బాలాజీ పరిపాలన అధికారి ముని రామకృష్ణ డీన్ మోహన్‌కృష్ణచౌదరి, వెల్ఫేర్ డీన్ రవి మాట్లాడుతూ ఇంజనీర్‌లు రాణించి ఉత్తమ స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ పిలుపునిచ్చారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 100మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారుల సేవలందించడమే కాకుండా సామాజిక బాధ్యతగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులందరూ రక్తదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాలలో యూనియన్ బ్యాంక్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి జగన్మోహన్‌రావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజర్వ్ హెడ్ పి.రవి, సుబ్‌నారాయణ, అవార్డు ఉద్యోగుల సంఘం నాయకులు బి.శ్రీనివాసులు, ఆఫీసర్ సంఘ నాయకులు, ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

# పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

## - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పల్లెలే దేశానికి పట్టుగొమ్ములని, వాటి అభివృద్దే ధ్యేయంగా స్వర్ణ గ్రామసభల పేరుతో జిల్లాల్లో 912 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సదస్సులు నిర్వహించి ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధిపై ప్రజలతో తీర్మానాలు చేయిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సానివాడ పంచాయితీలో శుక్రవారం జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రచ్చబండలో మాట్లాడారు. డ్రెయిన్ లేని, సిమెంట్ రోడ్డు లేని గ్రామాలను రెండేళ్ళలోనే తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సానివాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫృహతో గ్రామ స్వరాజ్య స్థాపనకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు చేయి,చేయి కలిపి గ్రామాభివృద్ధికి సమిష్టి కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభల నిర్వహణతో స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి ఈ సభలు దోహద పడతాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. సర్పంచ్ రుప్పలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ ఎన్.వి. చిట్టిరాజు, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్. వెంకట్రామన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్, జడ్పీటీసీ రుప్ప దివ్య ఎంపీటీసీ రుప్ప అప్పలసూరి తదితరులు హాజరయ్యారు.

# టంగుటూరికి ఎస్పీ నివాళి

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రకాశం చిత్రపటానికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కెవి మహేశ్వర్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమించిన ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అని కొనియాడారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఏ.ఓ గోపినాథ్, సీఐ దేవుళ్ళు, ఆర్ఐ నర్సింగరావు ఎస్.ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో టంగుటూరికి నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రకేసరిగా చరిత్రకెక్కిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ సైమన్ గోబ్యాక్ అంటూ తెల్లదొరలకు ఎదురుతిరిగిన ధీరోదాత్తుడని కొనియాడారు. టంగుటూరి 1937లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రాజాజీ సర్కార్‌లో రెవెన్యూ శాఖామంత్రిగా పనిచేశారన్నారు. టంగుటూరి 'స్వరాజ్య' అనే పత్రికను కూడా నడిపారని గుర్తు చేశారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ఎంతోచురుకుగా, కీలకంగా వ్యవహరించిన ప్రకాశం పంతులు 1953 అక్టోబరు 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, కృషికార్ లోక్ పార్టీ, సోషలిస్ట్‌పార్టీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. విశాఖ జిల్లాలోని శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి టంగుటూరి ఎంఎల్‌ఏగా ఎన్నికయి ఆంధ్రరాష్ట్ర శాసనసభలో అడుగు పెటారన్నారు. కార్యక్రమంలో బి.సి సంక్షేమ శాఖ అధికారిణి అనురాధ, కలెక్టరేట్ ఏఓ సూర్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.